
సాక్షి ఒడిశా

శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4.08.260లు, బంగారం 37 గ్రాముల 200 మిల్లీగ్రాములు వెండి 23గ్రాముల 390 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్నాం

రాష్ట్రంలో తొలిసారి అధికారం చేపట్టి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన చేస్తున్నామని సీఎం మోహన్‌చరణ్ మాఝి అన్నారు.

- 8లో



క్రీడలతో ఉజ్వల భవిష్యత్

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేయడానికి కలెక్టరేట్‌కు వెళ్లిన గ్రామస్తులు

జయపురం: తమ గ్రామానికి సంబంధించి ఒక జిల్లా పరిధిలో పంచాయతీ కార్యాలయం, మరో జిల్లా పరిధిలో తహసీల్దార్ కార్యాలయం ఉండడం వలన ఇబ్బందులు పడుతున్నామని భలియపొదర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్‌ను గురువారం కలిశారు. తమ గ్రామం కొరాపుట్ జిల్లా లబతాపుట్ సమితి బాదిగుడ పంచాయతీలో, మల్కన్‌గిరి జిల్లా ఖొయిరిపుట్ సమితిలోని తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ఉందన్నారు. దీంతో ఇబ్బంది పడుతున్నామని, అందువలన తమ గ్రామాన్ని లమతాపుట్ సమితి మాచ్‌ఖండ్ తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. తమ గ్రామం మొదటి నుంచి కొరాపుట్ జిల్లాలో ఉందని, గతంలో కొరాపుట్ జిల్లా గున్నుయిపడ తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ఉండేదని గుర్తు చేశారు. అయితే ఏదో కారణం వలన గ్రామాన్ని మల్కన్‌గిరి జిల్లా ఖొయిరపుట్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. తమ గ్రామం నుంచి ఖొయిరపుట్ 70 కిలోమీటర్ల దూరం ఉండడంతో, అక్కడికి రెవెన్యూ పనుల కోసం వెళ్లడానికి వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మారిన చిరునామా

భువనేశ్వర్: రాష్ట్ర ప్రజల అభియోగాలు, ఫిర్యాదుల విచారణ శిబిరం చిరునామా మారింది. త్వరలో ముఖ్యమంత్రి ప్రవేశించనున్న కొత్త ప్రభుత్వ బంగ్లాలో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. స్థానిక యూనిట్-5 వీఐఐఐఎంఆర్-4 నంబర్ భవనం ఆధునికీకరణ పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. ఈనెల 23వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల నుంచి ప్రజల అభియోగాలు, ఫిర్యాదులను అక్కడ నుంచే ముఖ్యమంత్రి విచారణ చేపట్టనున్నారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో అభియోగాలు, ఫిర్యాదులు నమోదు చేసుకోవాలని తెలిపారు. గరిష్ఠంగా 1,000 మాత్రమే నమోదు చేయడం జరుగుతుందని ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది. అభియోగాలు, ఫిర్యాదులను http://janasunani.odisha.gov.in పోర్టల్ లేదా జనసునాని మొబైల్ యాప్ ద్వారా దాఖలు చేయాల్సి ఉంటుంది. విచారణకు హాజరయ్యే సమయంలో నమోదు రశీదు, అభ్యర్థి గుర్తింపు కార్డుతో హాజరవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

పార్కులు ప్రారంభం



మార్టిన్ లూథర్ పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ తదితరులు

జయపురం: పట్టణంలోని అరవింద నగర్‌లో, క్రిస్టియన్ పేట మార్టిన్ లూథర్ జంక్షన్‌లో అధునాతనంగా నిర్మించిన పార్క్‌లను బుధవారం రాత్రి జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ప్రారంభించారు. మార్టిన్ లూథర్ జంక్షన్‌లోని పార్క్‌ను రూ.15 లక్షల వ్యయంతో, అరవింద నగర్‌లో రూ.14 లక్షల వ్యయంతో పార్కులను నిర్మించినట్లు మున్సిపల్ కార్య నిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ వెల్లడించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్మన్ బి.సునీత, మున్సిపాలిటీ ఇంజినీర్లు బిశ్వనాథ్ పాత్రో, ప్రతాప్ చంద్ర ఆచార్య, అజయ కుమార్ జాని, చైతన్య బాసకే తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీకి బెదిరింపులపై నిరసన



ఆందోళన చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ కార్యకర్తలు

భువనేశ్వర్: భారత పార్లమెంటులో విపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా చేస్తున్న హత్య బెదిరింపులు, కించపరిచే వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ గురువారం భారీ నిరసన ప్రదర్శించింది. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ భవన్ నుంచి ఖారవేళ నగర్ ఠాణా వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా మోదీ సర్కారుకు పక్కలో బల్లెంలా విజృంభించడంపై భయభ్రాంతులకు గురైన బీజేపీ, మిత్ర కూటమి ఆయనపై అవాంఛనీయ వ్యాఖ్యలు, బెదిరింపులతో డాంబికాలు ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీకి హత్య బెదిరింపుపై చట్టపరమైన చర్యలు కోసం ఖారవేళ నగర్ ఠాణాలో ఫిర్యాదు దాఖలు చేశారు.

● అభినందనలు



ఇటీవల విడుదలైన సివిల్స్ పరీక్షల తుది ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల తల్లిదండ్రులను రాజ్ భవన్‌లో గవర్నర్ రఘుబర్ దాస్ గురువారం అభినందించారు. పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. - భువనేశ్వర్

డయేరియాతో మరొకరి మృతి



ప్రజలకు సూచనలు చేస్తున్న వైద్య బృందం

రాయగడ: కల్యాణ సింగుపూర్ సమితి సెరిగుమ్మ పంచాయతీలోని లంబేరి గ్రామంలో డయేరియాతో బుధవారం రూపా నచిక (45) అనే మహిళ మృతి చెందింది. దీంతో గ్రామంలో మృతుల సంఖ్య ఐదుకు చేరుకుంది. కొద్దిరోజులుగా గ్రామంలో వ్యాపించిన ఈ వ్యాధి కారణంగా ఇప్పటికే నలుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. సోమవారం గ్రామానికి చెందిన నచిక డయేరియా వ్యాధితో బాధపడుతుండగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. దీంతో అప్రమత్తమైన వైద్య బృందం లంబేరి గ్రామానికి చేరుకుంది. జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మమత చౌదరి నేతృత్వంలో ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ సురేష్ కుమార్ పండ, డాక్టర్ అన్నపూర్ణ, వైద్య సిబ్బంది సురేష్ కుమార్ మహంత, ఆరోగ్య కార్యకర్త పద్మలత తదితరులు గ్రామానికి వెళ్లారు. వ్యాధి వ్యాపించడానికి గల కారణాలను అన్వేషించిన వైద్య బృందం ఈ మేరకు జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



అరెస్టైన శంకర్ ముజుందర్

మల్కన్‌గిరి: చోరీ కేసులో శంకర్ ముజుందర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 7వ తేదీన మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఉన్న ఉత్కళ గ్రామీణ బ్యాంక్, డీసీబీ బ్యాంకుల్లో తనఖా పెట్టిన బంగారాన్ని శంకర్ ముజుందర్ దొంగలించాడు. దీంతో బ్యాంక్ అధికారులు 8వ తేదీన మల్కన్‌గిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఎవరికీ తెలియకుండా ఎంక్వైరీ నిర్వహించాలని కోరారు. దీంతో నిఘా వర్గాల సాయంతో వారం రోజులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో ఆధ్వర్యంలో మల్కన్‌గిరి ఎంవీ 11 గ్రామంలో నివసిస్తున్న ముజుందర్ దొంగలించినట్లు నిర్ధారించారు. దీంతో అతడిని అతని ఇంట్లోనే విచారించగా నేరం తానే చేసినట్లు అంగీకరించాడు. దొంగలించిన బంగారాన్ని గురువారం ఉదయం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగ 14 నెలల జైలు శిక్ష విధించారు.

ఫార్మసీ కోర్సులో ఉచిత శిక్షణ



విశాఖపట్నంలోని స్కిల్ డవలప్‌మెంట్ అథారిటీ

పర్లాకిమిడి: ఒడిశా స్కిల్ డవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో స్టోర్ అసోసియేట్ (ఫార్మసీ) కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశాలోని గజపతి జిల్లాకు చెందిన 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీ, యువకులు మరియు ప్లస్ టూ, లేదా సైన్సులో పట్టభద్రులైనవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. శిక్షణాకాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు శ్రీకాకుళంలో జెమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో తమ సంస్థ నందు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 80008 89395, 82476 56581, 79950 13422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పర్యాటకులకు కనువిందు



బాలుఖొండో అభయారణ్యంలో కృష్ణ జింకలు

భువనేశ్వర్: పూరీ నుంచి ప్రఖ్యాత పర్యాటక కేంద్రం కోణార్కు సాగర తీర ప్రయాణం అత్యంత ఆహ్లాదభరితం. ఈ మార్గంలో కోణార్కు - బాలుఖొండొ అభయారణ్యం పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణ. పూరీ నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ప్రాంతం జింకల సంరక్షణకు ప్రసిద్ధి. ఇటీవల కాలంలో ఈ అభయారణ్యంలో కృష్ణ జింకలు కనుమరుగయ్యాయి. స్థానిక బారంగ్ నందన కానన్ జంతు ప్రదర్శన శాల నుంచి కృష్ణ జింకలను తరలించారు. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 13 కృష్ణసార జింకలను కోణార్కు - బాలుఖొండొ అభయారణ్యానిక తరలించారు. అనుకూల పర్యావరణం మధ్య వీటి సంతతి సమృద్ధిగా విస్తరిస్తుందని భావిస్తున్నారు.

సూర్య దేవాలయం పరిశీలన



సూర్య మందిరం ప్రాంగణంలో డీజీ జన్విజ్ శర్మ తదితరులు

భువనేశ్వర్: నల్ల పగోడాగా పేరొందిన కోణార్కు సూర్య దేవాలయం తాజా స్థితిగతులను భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అదనపు డైరెక్టర్ జనరల్ జన్విజ్ శర్మ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన 6 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక నిపుణుల బృందంతో ఆలయ సముదాయం సందర్శించారు. ఆలయం గర్భ గుడిలో పేరుకుని ఉన్న ఇసుక తొలగింపు పనుల పురోగతిని సమీక్షించారు. పురాతన కట్టడాల పర్యవేక్షణ సాధారణ కార్యాచరణగా పేర్కొన్నారు.

మూడు రోజుల్లో నివేదిక ఇవ్వండి

భువనేశ్వర్: ఆర్మీ మేజర్ గురువంత్ సింగ్, అతని స్నేహితురాలిపై భరత్‌పూర్ పోలీసుస్టేషన్‌లో జరిగిన వేధింపుల ఘటనపై జాతీయ మహిళ కమిషన్ చొరవ కల్పించుకుంది. ఈ మేరకు బాధ్యులైనవారిపై చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీకి లేఖ రాసింది. 3 రోజుల్లో సమగ్ర నివేదికని దాఖలు చేయాలని రాష్ట్ర పోలీసులకు ఆదేశించింది. దీంతో ఈ ఘటనపై ఈ సంఘటనపై డీజీపీ వై.బి.ఖురానియా స్పందించారు. బాధితుడు ఆర్మీ మేజర్ గురువంత్ సింగ్ దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు విచారణకు ఆదేశించారు. రాత్రిపూట రోడ్డు మీద వీరిపై దురుసు వైఖరి ప్రదర్శించిన ఆకతాయిలపై చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సంఘటన పూర్వాపరాలను పరిగణనలోకి తీసుకుని పటిష్టమైన చర్యలు చేపడతామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి ధమునిపొంగ పంచాయతీలోని ఒడాబడి గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాల పాలయ్యారు. గాయాలైనవారిలో కలహండి జిల్లాలోని బీజేపూర్ పంచాయతీ కరణముండ గ్రామానికి చెందిన బొనొ మాఝి, పడహడపాదొరొ పంచాయతీలోని మిలిపొడ గ్రామానికి చెందిన డొంబురు సాహులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారు తెలియజేసిన వివరాల ప్రకారం గురువారం బొనొ మాఝి, డొంబురు సాహులు బైకుపై కల్యాణ సింగుపూర్ వస్తుండగా ఒడాబడి గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పడంతో ప్రమాదానికి గురయ్యారు. అక్కడున్న స్థానికులు వీరిని కల్యాణ సింగుపూర్ హాస్పిటల్‌కు తరలించారు.

● అగచాట్లు..!



మహిళా సాధికారతే లక్ష్యమనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సుభద్ర పథకాన్ని ప్రారంభించింది. ఈనెల 17వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా తొలి విడత లబ్ధిని అర్హులైన వారి పొదుపు ఖాతాలకు ప్రత్యక్షంగా బదిలీ చేసింది. అయితే ఈ పథకం కోసం దాఖలైన 2 వేల దరఖాస్తులను తిరస్కరించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మహిళ - శిశు అభివృద్ధి శాఖ మంత్రి ప్రభాతి పరిడా ప్రకటించారు. దీంతో దరఖాస్తు ఆమోదం తాజా స్థితిగతులను తెలుసుకునేందుకు సుభద్ర ఆశావాద మహిళలు ఇలా బారులు తీరారు. ఈ దృశ్యం జాజ్‌పూర్ జిల్లా బొరీ మండలం బలియాపాల్ ప్రాంతంలో ఇండియన్ బ్యాంకు శాఖ కార్యాలయం ప్రాంగణంలోనిది. - భువనేశ్వర్

ఘోరం..!

● ఇంటికి తాళం వేసి నిప్పు పెట్టిన అగంతకులు

భువనేశ్వర్: ఇరువర్గాల మధ్య కక్షలు వికృత రూపం దాల్చిన ఘటన ఇది. ఇరుగు పొరుగు వారి మధ్య చోటు చేసుకున్న వాగ్వివాదంతో రాత్రిపూట నిద్రపోతున్న సమయంలో ఇంటికి బయట నుంచి తాళం వేసి నిప్పు అంటించారు. మంటలు చెలరేగిన పరిస్థితిని గమనించిన ఇంట్లో వ్యక్తులు సమయస్ఫూర్తితో బయటకు రావడంతో బతికి బట్ట కట్టగలిగారు. ఈ ఘటన బుధవారం రాత్రి భద్రక్ జిల్లా చాంద్‌బాలి మండలం ధామ్రా పోలీసు ఠాణా పరిధి నర్సింగ్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి లంబోదర్ ఇంటికి తాళం వేసి నిప్పు అంటించారు. మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న 6 మంది సభ్యులు తలుపులు తెరిచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా తాళం వేసి ఉన్నట్లు గమనించి విరగ్గొట్టుకుని అదృష్టవశాత్తు బయటపడ్డారు. వీరంతా బయటకు వచ్చి చూడబోయే సరికి ఆగంతకులు పారిపోతున్నట్లు గుర్తించారు. పగటి పూట బైక్ రాపిడి ఘటనలో పొరుగింటికి చెందిన రవి నారాయణ ఇద్దరు కుమారులతో వీరికి వాగ్వాదం జరిగింది. దీంతో వారే ఇలా చేశారని బాధిత వర్గం ఆరోపిస్తోంది. సమాచారం అందుకున్న ధామ్రా ఠాణా పోలీసులు అగ్నిమాపక దళంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు నివారించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



సంఘటన స్థలంలో పరమానంద రైయితో మృతదేహం




తీవ్రగాయాలతో పడివున్న భాస్కర దొళాయి.



సంఘటన స్థలంలో బైక్

పర్లాకిమిడి: మోహనా సమితి గోవిందపూర్ జంక్షన్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. రామగిరి ప్రాంతం నుంచి ఒక బైక్‌పై ఇద్దరు వ్యక్తులు బరంపురం వెళ్తుండగా గోవిందపూర్ జంక్షన్ మలుపు వద్ద బరంపురం నుంచి వేగంగా వస్తున్న ట్రక్కు వీరిని ఢీకొంది. దీంతో బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఎగిరిపడ్డారు. సమాచారం తెలుసుకుని సంఘటన స్థలానికి మోహనా పోలీసులు చేరుకున్నారు. ప్రమాదంలో బైక్ డ్రైవ్ చేస్తున్న పరమానంద రైయితో(31) సంఘటన స్థలంలోనే మృతి చెందగా, మరో వ్యక్తి భాస్కర్ దొళాయి తీవ్రగాయాలు పాలయ్యాడు. దీంతో అతడిని తొలుత మోహనా ప్రాథమిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బరంపురం మెడికల్‌కు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి భాస్కర్ దొళాయి మృతి చెందినట్లు బరంపురం మెడికల్ ఆస్పత్రి డాక్టర్లు ధ్రువీకరించారు. పోలీసులు బైక్, ట్రక్కును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో రామగిరి గ్రామంలో విషాదం నెలకొంది.

భువనేశ్వర్‌లో బాంబు దాడి



ఘటనా స్థలం



సీసీ టీవీ ఫుటేజీలో గుర్తు తెలియని వ్యక్తుల కదలికలు

భువనేశ్వర్: నగరంలో బుధవారం రాత్రి బాంబు దాడి జరిగింది. ఒకే ప్రాంతంలో రెండు వేర్వేరు చోట్ల ఈ ఘటన చోటు చేసుకుంది. పాత కక్షలతో గుర్తు తెలియని వ్యక్తులు ఈ దాడికి పాల్పడినట్లు భావిస్తున్నారు. స్థానిక బాపూజీ నగర్ కేదారపల్లి బీదలవాడలో లేన్ - 1, బరహంపూర్ వీధి బస్తీలో బాంబులు రువ్వారు. ఈ దాడిలో ఒక మైనర్ బాలుడు గాయపడ్డాడు. చికిత్స కోసం స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలో చేర్చారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఆగంతకుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.



ఇంట్లో నీటిని తోడుతున్న వృద్ధురాలు



ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కుండపోత

గుసాని సమితి జాజిపురం గ్రామంలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామంలోని కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంచాయతీ అధికారులు కాలువల్లో చెత్తను తొలగించకపోవడంతోనే ఇళ్లలోకి నీరు చేరిందని ఆరోపించారు.

పర్లాకిమిడి

క్లుప్తంగా

జిల్లా కేంద్రాల్లో వైద్య కళాశాలలు

భువనేశ్వర్: రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో ఒక్కో వైద్య కళాశాల ఏర్పాటు అవుతుందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముకేష్ మహాలింగ్ గురువారం ప్రకటించారు. రానున్న 5 ఏళ్లలో ఈ కార్యాచరణ పూర్తవుతుందన్నారు. తాల్చేరు, కంధమల్ జిల్లా కేంద్రాల్లో వైద్య కళాశాల ఏర్పాటు సన్నాహాలు కొనసాగుతున్నట్లు మంత్రి ప్రకటించారు.

మంకీపాక్స్ వ్యాప్తి కట్టడికి చర్యలు

భువనేశ్వర్: మంకీపాక్స్ సంక్రమణ కేసుల పెరుగుదల కలవరపరుస్తోంది. ప్రపంచ దేశాలతో పాటు మన దేశంలో దీని జాడ ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న వారి ఆరోగ్య చరిత్రపై నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా తెలిపారు. గత 21 రోజుల్లో శరీరంపై దద్దుర్లు, జ్వరం వంటి సంకేతాలు ఉంటే తక్షణమే ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం, పారాదీప్ పోర్టు, క్యాపిటల్ ఆస్పత్రి, జిల్లా ప్రధాన వైద్య అధికారులు (సీడీఎంవో), ప్రజారోగ్య అధికారులు, వైద్య కళాశాల ఆస్పత్రులకు మంకీపాక్స్ వ్యాప్తి నివారణపై అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న రఘునాథ్ ఖిలో

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి మద్కుపల్లి పంచాయతీ మల్లాలిగూడ గ్రామంలో నివాసముంటున్న రాఘునాథ్ ఖిలో కర్రలు కోసం గురువారం సాయంత్రం సమీపంలోని అడవికి వెళ్లాడు. అనంతరం తిరిగి వస్తున్న సమయంలో ఆయనపై ఒక ఎలుగుబంటి దాడి చేసింది. దీంతో గాయపడిన ఆయనను ఆకుల కోసం వెళ్లిన మరొకరు చూసి మోసుకొని గ్రామానికి తీసుకొచ్చారు. అనంతరం స్థానికులు అంబులెన్స్‌లో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు. ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి



సాహు మృతదేహం

జయపురం: నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్ పోలీసుస్టేషన్ పరిధి కొపేన పంచాయతీ ఇంగర గ్రామంలో బుధవారం వినాయక నిమజ్జనం జరిగింది. దీనిలో గ్రామానికి చెందిన ప్రహ్లాద్ సాహు(45) పాల్గొన్నాడు. కాగా విగ్రహ నిమజ్జనం సమయంలో సాహు నీటిలోకి దిగగా కాలుజారి నీటిలో మునిగిపోయాడు. అతడితో ఉన్నవారు చూసి నీట మునిగిన సాహుని బయటకు తీశారు. బయటకు తీసిన కొన్ని నిమిషాల్లో సాహు మృతి చెందాడు. ఈ విషయం పోలీసులకు తెలియజేయగా పోలీసులు వచ్చి కేసు నమోదు చేశారు.

జయపురంలో చోరీ



ఇనుప బీరువా పగలుగొట్టిన దృశ్యం

జయపురం: స్థానిక హతీశాల(ఏనుగుల శాల) ప్రాంతంలో ఒక ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. ఆ ఇంట్లో ఉన్నవారు తమ స్వగ్రామం బరంపురం వెళ్లారు. దీంతో దొంగలు ఇనుపరాడ్లతో తలుపులు విరిచి లోనికి ప్రవేశించారు. ఇంట్లోని రెండు ఇనుప బీరువాల తలుపులు తెరచి బంగారం, నగదు ఉంటాయని గాలించారు. ఏమీ లేకపోవడం వలన బీరువాలో ఉన్న విలువైన దుస్తులు దోచుకెళ్లిపోయారని పోలీసు అధికారి గురువారం వెల్లడించారు. ఆ ఇంటి చుట్టుపక్కల ఇళ్లవారు దొంగతనం జరిగినట్లు తెలుసుకొని జయపురం పట్టణ పోలీసులకు తెలియజేయగా పోలీసులు వచ్చి దర్యాప్తు జరుపుతున్నారు.

స్వచ్ఛతా హీ సేవ



స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు రెవెన్యూ కాలనీలో అధికారులు, ప్రభుత్వ సిబ్బంది స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం గురువారం నిర్వహించారు. అనంతరం కాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, తహసీల్దార్ నారాయణ బెహరా, డిప్యూటీ కలెక్టర్ ప్రాణకృష్ణ పాణిగ్రాహి, పురపాలక సంఘం కార్యనిర్వహణ అధికారి గౌరో చంద్ర పట్నాయక్, అదనపు తహసీల్దార్ బి.అలియా రెడ్డి, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్నాం



మాట్లాడుతున్న సీఎం మోహన్‌చరణ్ మాఝి

- హామీలను అమలు చేస్తున్నాం
- ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ
- బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిసారి అధికారం చేపట్టి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన చేస్తున్నామని సీఎం మోహన్‌చరణ్ మాఝీ అన్నారు. బీజేపీ ప్రభుత్వ పాలన 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పూరీ పట్టణంలోని శారదా బాలి ప్రాంతంలో ప్రత్యేక కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 100 రోజుల పాలనలో ప్రభుత్వ సాఫల్యతని వివరించారు. ఎన్నికల ప్రచారం పురస్కరించుకుని ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రజల మౌలిక అవసరాలకు ఏమాత్రం లోటు లేని పాలన అందజేసే దృక్పథంతో ముందుకెళ్తున్నామని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజాహిత పథకాలను రాష్ట్ర ప్రజలకు అక్కరకు వచ్చే రీతిలో చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి విజయ్ పాల్ తోమర్, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడా తదితరులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాలు అందజేత

ఈ సందర్భంగా సుభద్ర, మధుబాబు పింఛన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, భీమ బొయి సామర్థ్య అభియాన్ కార్యక్రమాల కింద లబ్ధిదారులకు నగదు ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి ప్రదానం చేశారు. 2036 నాటికి రాష్ట్రం ఏర్పడి వంద సంవత్సరాలు అవుతుందని, అప్పటికి వికసిత ఒడిశా ఆవిష్కరణ తథ్యమని ప్రకటించారు. మరో పుష్కర కాలం పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

నాలుగు ద్వారాలు తెరిచాం

ప్రభుత్వం ఏర్పడిన తొలి నాటి నుంచే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం పూరీ శ్రీజగన్నాథ దేవస్థానం నాలుగు ద్వారాలను తెరిచి భక్త జనులకు ఇచ్చిన హామీని అక్షరాల నెరవేర్చినట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలంగా ఊగిసలాడిన శ్రీజగన్నాథుని రత్న భాండాగారం తెరిచే అంశంపై సందిగ్ధత తొలగించడం జరిగిందన్నారు. శ్రీజగన్నాథ ఆలయం నిర్వహణకు భారీగా రూ.500 కోట్ల కార్పస్ నిధి ఏర్పాటు ఒక మైలు రాయిగా పేర్కొన్నారు. ఒడియా ఆత్మ గౌరవం పరిరక్షణ కోసం ప్రత్యేకంగా రూ.2,000 కోట్ల కేటాయింపుతో కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రైతుల కోసం సీఎం కిసాన్ యోజన ప్రారంభించడంతో వరి క్వింటాలు కనీస మద్దతు ధర రూ.3,100గా ప్రకటించినట్లు తెలిపారు. కనీస మద్దతు ధర కోసం బడ్జెటులో రూ.5 వేల కోట్లు కేటాయించామన్నారు. మహిళా సాధికారత పురోగతి లక్ష్యంగా సుభద్ర యోజన జయప్రదంగా ప్రవేశపెట్టడం పూర్తయ్యిందని పేర్కొన్నారు.

అవినీతి నిర్మూలనే లక్ష్యం

రాష్ట్రంలో గత 2 దశాబ్దాలు పైబడి పేరుకుపోయిన అవినీతి వ్యవస్థని నిర్మూలించడమే లక్ష్యంగా కొత్త ప్రభుత్వం పని చేస్తుందని సీఎం తెలిపారు. స్వల్పంగా 100 రోజుల పాలనలో 71 అవినీతి కేసులను నమోదు చేశామన్నారు. 58 మంది అవినీతి ప్రభుత్వ అధికారులు, సిబ్బందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వీరిలో 17 మంది ప్రథమ శ్రేణి, ఇద్దరు ద్వితీయ శ్రేణి అధికారులు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్యం, ఆదాయం

ప్రజలకు చక్కని ఆరోగ్యంతో పుష్కలమైన ఆదాయం కోసం ఉద్యోగం, ఉపాధి అవకాశాల్ని స్థానికంగా కల్పించే దిశలో ప్రభుత్వ పాలన చురుకుగా సాగుతోందన్నారు. ఈ దిశలో పారిశ్రామిక విస్తరణ బలోపేతం చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి కొరత లేకుండా చేయడం జరుగుతుందన్నారు. తలదాచుకునేందుకు బీదబిక్కి వర్గాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు కేటాయించడం తథ్యమని అభయం ఇచ్చారు. ఆరోగ్య సేవల కోసం ఆయుష్మాన్ భారత్ పథకం నిరవధికంగా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వం, ప్రజల మధ్య చేరువ కల్పించేందుకు క్రమం తప్పకుండా అభియోగాలు, ఫిర్యాదులను విచారించి అక్కడికక్కడే తక్షణ చర్యలకు ఆదేశించడం జరుగుతోందన్నారు.



బీజేపీ ప్రభుత్వం 100 రోజుల పాలన సాఫల్య సంచిక ఆవిష్కరణ



దివ్యాంగులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం

ఆదివాసీ సంఘాల ఆందోళన



సభలో ప్రసంగిస్తున్న పాట్నా ముదిలి

మల్కన్‌గిరి: స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆదివాసీ సంఘాలు గురువారం ఆందోళన చేపట్టాయి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం 1996లో వసుంధర పథకంపై గిరిజనులకు సొంత ఇళ్లు ఇస్తామన్నారని, వాటిని ఇవ్వాలని కోరారు. అలానే సరిహద్దుల్లో ఉంటున్న గిరిజనులకు సమాన హక్కులు కల్పించాలన్నారు. 2006లో ఇచ్చిన హామీ ప్రకారం అడవి భూములు లీజుకు ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టు ఎత్తుకు పరిమితి విధించాలని, చిత్రకొండ జలాశయం నిర్మాణ సమయంలో నీటి మధ్యలోనే ఉండిపోయిన గిరిజనులకు పునరావాసం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆదివాసీ సంఘ అధ్యక్షుడు పాట్న ముదిలి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న ఆదివాసీ తెగలు

పేపర్ మిల్లులో ఉత్పాదన ప్రారంభం



ఉత్పాదన ప్రారంభమైన దృశ్యం

జయపురం: ఎట్టకేలకు రెండున్నర నెలల తర్వాత జయపురం సమితి గగణాపూర్‌లో ఉన్న సేవా పేపరు మిల్లులో ట్రైల్ బేసిస్‌లో ఉత్పాదన ప్రారంభమైంది. అయితే ఇది రెండు, లేక మూడు రోజులు ట్రైల్ బేసిస్‌లో ఉత్పాదన చేయబడుతుందనీ, మిల్లుకు ఆర్థిక వనరులు సమకూర్చే సంస్థకు ఉత్పాదన చూపించటం జరుగుతుందన్నారు. ఆ సంస్థ సంతృప్తి చెంది ఆర్థిక వనరులు సమకూర్చితే మిల్లు పూర్తిస్థాయిలో నడుస్తుందని యాజమాన్య వర్గాలు వెల్లడించాయి. మిల్లు పేపరు ఉత్పత్తి ప్రారంభించినందుకు కార్మిక నేత ప్రమోద్ మహంతి స్వాగతించారు. మిల్లు ఉత్పాదన ప్రారంభించడంపై ఆనందం వ్యక్తం చేస్తూ కార్మికులు తమ పూర్తి సహకారం అందించగలరని హామీ ఇచ్చారు. అయితే కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని కోరారు.

పోలీసుస్టేషన్‌పై దాడి



టైర్లను కాల్చి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- తప్పుడు కేసులు పెడుతున్నారని ఆందోళన

రాయగడ:

అమాయకులైన వారిని పోలీసులు అరెస్టు చేసి, వారిపై తప్పుడు కేసులను బనాయించి నానా విధాలుగా హింసలు పెడుతున్నారని ఆరోపిస్తూ జిల్లాలోని కాసీపూర్ సమితి సిజిమాలి గ్రామానికి చెందిన వందలాది మంది మహిళలు, పురుషులు ఆందోళన చేశారు. ఈ మేరకు వారంతా కలిసి కాసీపూర్ పోలీస్‌స్టేషన్‌లోకి ఒక్కసారి ప్రవేశించి చైర్లు, వివిధ వస్తువులు ధ్వంసం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట టైర్లను తగులబెట్టి బయటే బైఠాయించారు. సమితిలోని సుంగేరు పంచాయతీ పరిధి బంతాజ్ గ్రామానికి చెందిన కార్తీక్ నాయక్ అనే యువకుడిని పోలీసులు కొద్దిరోజుల క్రితం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. సిజిమాలి గ్రామ సమీపంలోని బాక్సైట్ నిక్షేపాల తవ్వకాల గురించి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాడనే కార్తీక్‌పై పోలీసులు తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేశారని గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై పోలీసులు గ్రామస్తుల మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ హరీష్ బీసి సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అయితే సమస్య ఒక కొలిక్కిరాలేదు. ఆందోళనకు సంబంధించి పోలీసులు మరికొందరిని అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది.



స్టేషన్‌లోకి ప్రవేశిస్తున్న ప్రజలు

23న భారత్ బంద్



సమావేశంలో మాట్లాడుతున్న మహంతి



సమావేశంలో పాల్గొన్న కార్మిక నేతలు

జయపురం: ఈనెల 23వ తేదీన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వివిధ వర్గాల ప్రతినిధులు కోరారు. స్థానిక యాదవ భవనంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు బంద్ విజయవంతం చేయడంపై చర్చించారు. ట్రేడ్ యూనియన్ నేత జుధిష్టర్ రౌళో అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర నేత ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ.. దేశ కార్మికులు, ప్రజలు కోవిడ్ మహమ్మ్రాగుప్పెట్లో ఉన్న సమయంలో 2020 సెప్టెంబర్ 23వ తేదీన కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎటువంటి ఆలోచన లేకుండా, అప్పటివరకు దేశంలో ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్‌లను ప్రవేశపెట్టిందని వెల్లడించారు. అప్పటి నుంచి ప్రతీ ఏడాది సెప్టెంబర్ 23ను బ్లాక్ డేగా పాటిస్తున్నాయని వెల్లడించారు. ఆ నాలుగు చట్టాల ద్వారా కార్పొరేట్ సంస్థలు కార్మికులకు దోచుకొనేందుకు మార్గం ఏర్పడిందని దుయ్యబట్టారు. అలాగే ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్యలు తలెత్తాయని వివరించారు. సమావేశంలో భువణ కుమార్, బసంత బెహర తదితరుల పాల్గొన్నారు.

సైబర్ సురక్షపై అవగాహన శిబిరం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

జయపురం: స్థానిక మోడ్రన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రాంగణంలో కొరాపుట్ జిల్లా న్యాయసేవ ప్రదీకరణ సంస్థ ఆధ్వర్యంలో సోషల్ మీడియా, సైబర్ సురక్షలపై అవగాహన శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవ ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల నుంచి ప్రతి ఒక్కరూ తమను తాము ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. పాస్‌వర్డ్‌లు ఎల్లప్పుడూ రహస్యంగా ఉంచాలని, అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లు క్లిక్ చేయవద్దని సూచించారు. ఏ వ్యక్తితోనూ ఓటీపీలను షేర్ చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో కొరాపుట్ సైబర్ సెల్ సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ కుమారి ప్రధాన్, మోడ్రన్ ఇంగ్లిష్ మహ్మద్ అబ్జల్ బాసి, స్కూల్ న్యాయ సచేతన క్లబ్ ఉపాధ్యాయుడు నిరంజన్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

పర్లాకిమిడి: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో అన్నారు. రాయఘడ సమితి ప్రభుత్వ ఉన్నత విద్యాలయంలో గజపతి జిల్లాస్థాయి క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి హాజరై క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో గెలిపొందిన విద్యార్థులకు స్పోర్ట్స్ షూస్ బహుమతిగా అందిస్తానని ప్రకటించారు. అలాగే రాష్ట్రస్థాయిలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.1000లు ప్రోత్సాహకంగా ఇస్తామని తెలిపారు. పోటీలకు ఏడు సమితి కేంద్రాల నుంచి 550 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ క్రీడా పోటీలు ఈనెల 20 వరకు జరుగుతాయని జిల్లా క్రీడాధికారి ప్రాణకృష్ణ పాణిగ్రాహి తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు డీఈవో మనోజ్ కుమార్ దొళాయి, బ్లాక్ క్రీడాధికారి ఎస్. పాపారావు, జిల్లాస్థాయి క్రీడాధికారి సురేంద్ర కుమార్ పాత్రో, రాయఘడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేష్ కుమార్ సాహుకార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల ప్రారంభానికి విచ్చేసిన నాయకులు, అధికారులు



క్రీడాకారులతో నాయకులు, అధికారులు



తైక్వాండో పోటీలకు విచ్చేసిన విద్యార్థులు

క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● డీఐజీ గోపినాథ్ జెట్టి

భోగాపురం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు మండలంలోని ముంజేరు గ్రామ సమీపంలో ఉన్న మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఆయన మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం, గంజాయి, కొకైన్, ఖైనీ,వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఎంతోమంది వారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తవుతాయని, యువతీ యువకులంతా చెడువ్యసనాల బారిన పడకుండా ఆదర్శవంతమైన జీవితం గడపాలని హితవు పలికారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎస్పీ వకుల్ జిందాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇసుక సరఫరా



వీడియో కాన్ఫరెన్స్‌లో వెబ్‌సైట్‌పోర్టల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలోని భామిని మండలంలో కాట్రగడ్డ ఇసుక స్టాక్‌పాయింట్ వద్ద ఇసుక పోర్టల్‌ను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాట్రగడ్డ ఇసుక రీచ్ వద్ద 1,05,300 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక తవ్వకాలు, నిర్వహణ తదితర ఖర్చులకు టన్నుకు రూ. 270తోపాటు రవాణా ఖర్చులు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇసుక పొందేందుకు వినియోగదారులు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూశ్యాండ్. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో బుక్‌చేసుకోవాలని చెప్పారు. ఇసుక సరఫరాకు నమోదు చేసుకున్న వాహనాలు మాత్రమే అనుమతించనున్నారని, సొంత ఇంటి నిర్మాణానికి నాటుబండితో తీసుకువెళ్లవచ్చని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవనాయుడు, జిల్లా భూగర్భ గనుల శాఖాధికారి కె. శ్రీనివాసరావు, జిల్లా రవాణా అధికారి టి. దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ కొని ఒకరికి గాయాలు



గాయాల పాలైన అప్పారావు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీ కొనడంతో మెరకముడిదాం మండల కేంద్రానికి చెందిన జి. అప్పారావు తలకు తీవ్ర గాయాలైనట్లు పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు. మెరకముడిదాం నుంచి పెదమానాపురం వైపు బైక్‌పై వస్తున్న అప్పారావుకు ఎదురుగా వంగర గ్రామానికి చెందిన మహేష్ పెదమానాపురం నుంచి బైక్‌పై తన స్వగ్రామానికి వెళ్తుండగా సబ్‌స్టేషన్ వద్ద రెండు బైక్‌లు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. దీంతో గాయాల పాలైన వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం 108లో విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వైద్యుల నిరసనను అణగదొక్కే కుట్ర

● జీతాల నిలుపుదలకు చర్యలు?

సాక్షి, పార్వతీపురం మన్యం: జీవో 85 రద్దు కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం(ఏపీపీహెచ్‌సీడీఏ) ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యులు నిరసన బాట పట్టిన విషయం విదితమే. జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులంతా విజయవాడలోనే సంఘం పిలుపు మేరకు ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగీ కేసులు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ప్రతి గ్రామంలోనూ అధిక సంఖ్యలో జ్వరపీడితులు కనిపిస్తున్నారు. ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఈ సమయంలో పీహెచ్‌సీల్లో వైద్యులు లేక, రోగులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఇటువంటి సందర్భంలో వైద్యుల న్యాయమైన డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించాల్సిన ప్రభుత్వం ..మొండి వైఖరికి వెళ్తున్నట్లు కనిపిస్తోంది. వారి నిరసన గొంతు నొక్కేలా డీఎంహెచ్‌వోల ద్వారా బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. ఎఫ్ఆర్ఎస్‌తో లింకు పెట్టి..విధులకు హాజరుకాని వైద్యుల జీతాలు నిలుపుదల చేసేందుకు సిద్ధమవుతోంది. సమ్మెలో ఉన్న పీహెచ్‌సీ వైద్యులకు విధుల గైర్హాజరు పేరుతో జీతాలు నిలుపు చేయాలని డీఎంహెచ్‌వోల ద్వారా ఖజానా అధికారులకు లేఖలు పంపుతున్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో చర్యలకు దిగగా.. ఇక్కడి అధికారులు కూడా నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీన్ని అరాచకమైన చర్యగా వైద్యుల సంఘం ప్రతినిధులు ఖండిస్తున్నారు. వాస్తవానికి వైద్యులకు సంబంధించి బయోమెట్రిక్‌కు, జీతాలకు సంబంధం లేదని..ఆ అధికారం డీఎంహెచ్‌వోకు కూడా ఉండదని చెబుతున్నారు. కేవలం జూనియర్ వైద్యులను బెదిరించి, సమ్మె విరమింపజేసేలా కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపిస్తున్నారు.

పైడితల్లి పండగకు పకడ్బందీగా ఏర్పాట్లు



పైడితల్లి అమ్మవారు

- ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న జాతర
- వనంగుడి, చదురుగుడుల్లో పందిరి రాట, దీక్షలతో ఉత్సవం ఆరంభం
- అగ్నిశాఖల అధికారులతో సమీక్షలు, ఏర్పాట్లపై టెండర్ల ఖరారు
- అక్టోబర్ 14న తొలేళ్లు, 15న సిరిమాను సంబరం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, ఆలయ అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఇటీవలే లడ్డూ ప్రసాదాలకు, పూలడెకరేషన్‌లు, టెంట్లు, షామియానాలు, కొబ్బరి చెక్కలు, చీరలు తదితర వాటికి టెండర్లను పూర్తిచేశారు. ఆలయం ఎదురుగా ఉన్న ఎడ్వర్డు ఆస్పత్రి స్థలాన్ని దేవదాయశాఖ కొనుగోలు చేసి ఆలయానికి ఇరువైపులా ఉన్న షాపుల యజమానులకు ఇప్పటికే అప్పగించారు. వారి స్థలాన్ని ఆలయ అభివృద్ధికి సేకరించారు. కళ్యాణ మండపంలో ఉన్న కార్యాలయంతో పాటు అన్నదాన సత్రం, ప్రసాదశాల తదితర వాటిని కొత్తగా సేకరించిన స్థలంలో ఉన్న ఖాళీ భవనాల్లోకి ఆలయ అధికారులు మార్చేశారు. ఆలయ పరిసర ప్రాంతం నుంచే నేరుగా అమ్మవారికి సేవలందిస్తున్నారు. ఇప్పటికే చదురుగుడి ఆలయానికి రంగులద్దారు. వనంగుడిలోనూ ఆర్చిల వద్ద పెయింటింగ్ పనులు చేపట్టారు. పందిరిరాట మహోత్సవం పూర్తయిన తర్వాత పూజారి ఉపవాస దీక్షలోకి వెళ్తారు. ఆ సమయంలో అమ్మవారు అతని కలలో కనిపించి సిరిమానును చూపిస్తుందన్నది భక్తుల విశ్వాసం. అక్టోబర్ 14న సోమవారం తొలేళ్ల ఉత్సవం, 15న మంగళవారం సిరిమాను ఉత్సవం, 22న మంగళవారం తెప్పోత్సవం, 29న మంగళవారం ఉయ్యాల కంబాల ఉత్సవం, 30న బుధవారం చండీహోమం, దీక్షావిరమణ, పూర్ణాహుతి, వనంగుడి వద్ద నిర్వహించనున్నారు.

20 నుంచి జాతరకు అంకురార్పణ

నెలరోజుల పాటు నిర్వహించే పైడితల్లి అమ్మవారి జాతర శుక్రవారం నిర్వహించే పందిరిరాట మహోత్సవంతో అంకురార్పణ జరుగుతుంది. అదేరోజు ఉదయం 8 గంటలకు అమ్మవారి మండల దీక్షలు ప్రారంభమవుతాయి. అనంతరం చదురుగుడి, వనంగుడిల వద్ద పందిరిరాట వేస్తారు. నాటి నుంచి ఆలయ ప్రాంగణం వద్ద ఉత్సవ ఏర్పాట్లపై అధికారులు, సిబ్బంది తలమునకలై ఉంటారు. ఈ ఏడాది ఖాళీ స్థలంలో క్యూలైన్స్ అదనంగా వేయడంతో పాటు చలువ పందిళ్లు, కాలికింద మ్యాట్‌లు ఏర్పాటుచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఎవరి బాధ్యతలు వారివే...

పైడితల్లి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం రంగం సిద్ధంచేసింది. కలెక్టర్ డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ ఆదేశాల మేరకు ఇప్పటికే సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సుమారు 22 శాఖలకు చెందిన అధికారులు ఎవరి బాధ్యతలు వారు చేపట్టనున్నారు. ఎండోమెంట్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఫిషరీస్, పోలీస్, రవాణా, రైల్వే, ఫారెస్ట్ తదితర శాఖల అధికారులు ఎప్పటికప్పుడు చేయాల్సిన విధివిధానాలపై సమీక్షిస్తారు.

శరవేగంగా ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నాం



పైడితల్లి జాతర అంటే ప్రజలందరి పండగ. నెల రోజుల పాటు నిర్వహించే అమ్మవారి ఉత్సవాలను ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులందరూ పండగ ఏర్పాట్లపై సమీక్షిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలి.

– డీవీవీ ప్రసాదరావు, ఈఓ, పైడితల్లి అమ్మవారి దేవస్థానం, విజయనగరం

చికిత్స పొందుతూ గిరిజన యువకుడి మృతి

పాచిపెంట: మండలంలోని కర్రివలస పంచాయతీ అమ్మ వలస గ్రామానికి చెందిన గిరిజన యువకుడు కోట జగన్నాథం (27) విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ విషయమై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి, గ్రామానికి చెందిన జగన్నాథం వ్యక్తిగత కారణాలవల్ల తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల 15వ తేదీన గ్రామ సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే సాలూరు సీహెచ్‌సీకి, అక్కడి నుంచి అదే రోజు మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరో యువకుడు..



బెల్లాన జగదీష్ (ఫైల్)

రాజాం సిటీ: ఈ నెల 15న మున్సిపాల్టీ పరిధి గాయత్రికాలనీకి చెందిన బెల్లాన జగదీష్ (20) పురుగు మందు తాగేయడంతో అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం రోడ్డులోని ఆంజనేయ గ్లాస్ హౌస్‌లో జగదీష్ పనిచేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. అయితే ఇటీవల గ్లాస్ హౌస్ యజమాని పిల్లల శ్రీను అధికంగా అప్పులు చేసి ఐపీ పెట్టి పరారయ్యాడు. ఆ షాపును వేరొకరికి అద్దెకు ఇచ్చేందుకుగాను షాపు అసలు యజమాని ఈ నెల 13న షాపు తెరిచాడు. ఈ విషయం తెలుసుకున్న పిల్లల శ్రీనుకు అప్పులు ఇచ్చిన బాధితులు అక్కడికి చేరుకుని ఆందోళన చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆ షాపులో పనిచేసిన జగదీష్‌ను కూడా శ్రీను ఎక్కడున్నాడని అప్పులు ఇచ్చిన వారు అడిగేవారు. అలాగే జగదీష్ మధ్యవర్తిగా ఉండి కొంతమొత్తం అప్పు ఇప్పించాడు. శ్రీనుకు అప్పులు ఇచ్చిన వారితోపాటు తాను అప్పు ఇప్పించిన వారు కూడా అడుగుతారేమో, భయాందోళన చెంది ఈ నెల 15న పురుగు మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని తండ్రి బెల్లాన మోహనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రైల్వే ట్రాక్ దాటుతుండగా వ్యక్తి..



రాజేశ్వరరావు మృతదేహం

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామం డౌన్‌లైన్ ట్రాక్ వద్ద రైల్వే పట్టాలు దాటుతుండగా మెంటాడ మండలం మీసాల పేట గ్రామానికి చెందిన బగ్గాం రాజేశ్వరరావు (47) మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టర్‌కు గిరిజనుల మొర



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గిరిజనులు

పార్వతీపురం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాలుగు కిలోమీటర్ల దూరం కాలి నడకన వచ్చి అక్కడినుంచి ట్రాక్టర్లతో, బస్సుతో ఆపసోపాలు పడి ఉదయం 5గంటలకే ఇంటి నుంచి బయల్దేరి కలెక్టర్ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు కురుపాం, సీతంపేట మండలాలకు చెందిన గిరిజనులు చేరుకున్నారు. మధ్యాహ్నం 1గంట అయినా కలెక్టర్‌ను కలిసేందుకు వారికి అనుమతి లేకపోవడంతో కార్యాలయం కారిడార్‌లోనే వేచిఉన్నారు. ఎట్టకేలకు వారంతా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు అందజేసి తమ సమస్యలు త్వరగా పరిష్కరించాలని వేడుకున్నారు. ఏనుగుల సంచారంతో పంటలు, ఇళ్లు నష్టపోతున్నామని, జరడ గ్రామానికి నీలకంఠాపురం నుంచి రహదారి సౌకర్యం లేకపోవడంతో రాకపోకలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని గర్భిణులను ప్రసవం సమయంలో డోలీలతో ప్రధాన రహదారి వద్దకు తీసుకురావాల్సి వస్తోందని వినతిపత్రంలో వాపోయారు.

రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీలకు గిరిజన పాఠశాల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కర్రి.సూర్య నారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 21, 22తేదీల్లో విశాఖపట్నంలోని మున్సిపల్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీలకు స్థానిక థామస్ పేట ఫుట్‌బాల్ మైదానంలో గురువారం ఎంపికలు జరిగిన సందర్భంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి కె.జాన్ బాబు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థిని హెచ్ఎం కర్రి సూర్యనారాయణ, పీఈటీలు వి.రామ చంద్రుడు, బి.జయకర్ జాన్సన్ ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కోనాడ విద్యార్థులు కూడా..



త్రోబాల్ పోటీలకు ఎంపికైన కోనాడ విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.ఎల్లాజీ, కె.ఫ్రాన్స్ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో విశాఖలో జరగబోయే పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి వారిద్దరూ ప్రాతినిధ్యం వహించనున్నారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో హెచ్ఎం చలంతో పాటు ఇతర ఉపాధ్యాయులు ఆ విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు..



జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులకు మెమెంటో ఇచ్చి అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు హారిక, ముఖేష్‌లు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి గురువారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం రామభద్రపురం మండలం కొట్టక్కి ఉన్నత పాఠశాలలో అండర్-19 విభాగంలో గురువారం జరిగిన పోటీలకు పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు హాజరుకాగా ఇద్దరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందంటూ పిల్లలను పీఈటీ, రాజేష్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

‘దారి’లో కొచ్చిన సర్కారు..!

- 201 కిలోమీటర్ల మేర రహదారి మరమ్మతులు
- రూ.11.75 కోట్లు విడుదల
- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

సాక్షి, పార్వతీపురం మన్యం: రాష్ట్రవ్యాప్తంగా గత జూలై నెలలో భారీ వర్షాలు/వరదల కారణంగా పార్వతీపురం మన్యం జిల్లాలో తీవ్రంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం రూ.11.75 కోట్లు మంజూరు చేసింది. జిల్లా నుంచి పంపిన ప్రతిపాదనల మేరకు నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ నిధులతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు చేపట్టనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ప్రధాన జిల్లా రహదారులు (ఎండీఆర్), స్టేట్ హైవే (ఎస్‌హెచ్)అత్యవసర మరమ్మతులు, ప్యాచ్ పనులకు రూ.11.75 కోట్లతో అంచనాలు సమర్పించగా..ప్యాచ్ వర్కుల కింద రూ.2 కోట్లతో 72.76 కిలోమీటర్లు, అత్యవసర మరమ్మతులు రూ.9.75 కోట్లతో 128.66 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 85.88 కిలోమీటర్ల మేరకు ఎస్‌హెచ్ మరమ్మతులు జరగనుండగా..అందులో 19 కిలోమీటర్లలో రూ.61 లక్షలతో ప్యాచ్‌వర్క్స్, రూ.4.60 కోట్లతో 66.88 కిలోమీటర్ల మేర అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నట్లు వివరించారు. ఎండీఆర్ కింద 115.53 కి.మీ. మరమ్మతులు చేపట్టనుండగా..అందులో ప్యాచ్‌వర్క్స్ కింద రూ.1.39 కోట్లతో 53.76 కిలోమీటర్లు, రూ.5.15 కోట్లతో 61.78 కిలోమీటర్లను అత్యవసర మరమ్మతుల కింద చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 201.42 కిలోమీటర్ల వరకు మరమ్మతులు చేపట్టనున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వివరించారు.

విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయ గీతాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి: పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన తోటపల్లిలోని జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు ఏర్పాటు చేసిన మన బడి-మన తోట శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జట్టు ట్రస్ట్ ద్వారా బడి నుంచి పొలంబడి అనే వినూత్న కార్యక్రమంద్వారా విద్యార్థి దశలోనే వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులకు ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన పెంచడం కోసమే మన బడి-మన తోట కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చదువుకునే విద్యార్థులలో అధిక శాతం రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి మరింత పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు ఖాళీ సమయాల్లో పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఆకు కూరలు, కూరగాయలు పండించడం నేర్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవడం కోసమే తోటపల్లిలోని జట్టు ట్రస్ట్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులను నిర్వహించామని తెలిపారు. పిల్లలకు స్కూల్‌లో ప్రకృతి వ్యవసాయం అలవాటు చేయడంవల్ల ఇంటి వద్ద కూడా కూరగాయలు పెంచడానికి ఆసక్తి చూపుతారని అభిప్రాయపడ్డారు. అనంతరం మన బడి-మన తోట ప్రకృతి వ్యవసాయ గీతాల పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించి రచయితలను సత్కరించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం శ్రీ పి.దినేష్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, ప్రకృతి వ్యవసాయ రీజినల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వి.కృష్ణారావు, డీపీఎం పి.షణ్ముఖ రావు, ప్రకృతి వ్యవసాయ మోడల్ మండల రీజినల్ కో ఆర్డినేటర్ కె. రమాప్రభ, విశ్రాంత ఉపాధ్యాయులు పీఎస్.ప్రకాశరావు, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్, రచయితలు, ఉపాధ్యాయులు, జట్టు ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజన్ డాక్యుమెంట్‌లో ప్రజల అభిప్రాయాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ నీరబ్ కుమార్

పార్వతీపురం: స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు కలెక్టర్లతో స్వర్ణాంధ్ర విజన్-2047పై గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వర్ణాంధ్రకు రానున్న ఐదేళ్ల వార్షిక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలని చెప్పారు. ప్రణాళికలో ప్రజల సూచనలు, సలహాలను స్వీకరించాలని, ప్రజా సంబంధమైన వార్షిక ప్రణాళిక ఉండాలని, ప్రజలు భాగస్వాములయ్యేందుకు క్యూ ఆర్ కోడ్ అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయగానే ప్రజల అభిప్రాయాలను పొందుపరచవచ్చని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ డీఆర్ఓ జి. కేశవ నాయుడు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యం నాయుడు, డ్వామా పీడీ కె.రామ చంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకర రావు, జిల్లా పశుసంవర్థక అధికారి ఎస్.మన్మథ రావు, డీఈఓ జి.పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

26లోగా స్వర్ణాంధ్ర గ్రామ సభలు నిర్వహించాలి

స్వర్ణాంధ్ర -2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు ఈనెల 26లోగా గ్రామ సభలను నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండల ప్రత్యేకాధికారులకు వీడియో కాన్ఫరెన్స్‌లో కోరారు. ఏడాదికి 15శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించాలని సూచించారు.

నియోజకవర్గాలకు ప్రత్యేకాధికారుల నియామకం

100రోజుల కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు నియోజకవర్గాలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. పార్వతీపురం నియోజకవర్గానికి జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, సాలూరు నియోజక వర్గానికి పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ, పాలకొండకు పాలకొండ సబ్‌కలెక్టర్ ఎస్. యశ్వంత్ కుమార్ రెడ్డి, కురుపాం నియోజకవర్గానికి డ్వామా పీడీ కె. రామచంద్రరావులను నియమించినట్లు తెలిపారు.

పోయాం..మోసం..!

● ఐఏఎస్ యాప్ బాధితుల ఆందోళన

కొమరాడ: అధిక డబ్బులు ఆశజూపిన ఓ ఆన్‌లైన్ కంపెనీలో జిల్లాలోని పలువురు పెట్టుబడులు పెట్టి మోసపోయారు. ఈ వ్యవహారంలోఆర్థికంగా మోసపోయి ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిలో లబోదిబో మంటున్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని దాసన్నపేట మెయిన్‌రోడ్డులో ఇండియన్ అడ్వర్టైజ్‌మెంట్ సర్వీస్(ఐఏఎస్)పేరుతో ఓ కార్యాలయం ఉంది. ఆన్‌లైన్‌లో ఇండియన్ అడ్వర్టైజ్‌మెంట్ సర్వీస్ పేరుతో నగదును జమ చేస్తే వారం వారం కమీషన్ రూపంలో నేరుగా నగదు వస్తుందని ఆ సంస్థ ఆశ చూపడంతో కొమరాడ మండలంలోని విక్రంపురం గ్రామానికి చెందిన వందలాది మంది ఆన్‌లైన్‌లో రూ.50 లక్షల వరకు నగదు జమ చేశారు. అయితే ఆన్‌లైన్‌లో నగదు పెట్టుబడి పెట్టిన కొంతమందికి ఆ సంస్థ ద్వారా కొంతమొత్తం కమీషన్లు వచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. ఒక్కసారిగా రూ.2,100 పెట్టుబడి పెడితే రోజుకు రూ.70 వంతున ఏడాదికి రూ.25,550,వస్తుందని ప్రచారం జరగడంతో వందలాది మంది ఒకరిని చూసి మరొకరు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి డబ్బులు పోగొట్టుకున్నామంటూ లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం ఈ సంస్థ ఆన్‌లైన్‌లో ఆర్థిక కార్యకలాపాలను నిలిపివేయడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు ఆన్‌లైన్ మోసానికి గురైనప్పటికీ ఏ ఒక్క బాధితుడూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి ముందుకు రాకపోవడం గమనార్హం.



యాప్

మోసపోయాను..



నేను, మా ఊరు యువత అంతా ఇండియన్ అడ్వర్టైజ్‌మెంట్ సర్వీస్ కంపెనీలో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టడంతో కొంతమందికి నగదు రావడంతో ఆశ పడి రూ.40,000 ఈ నెల 6వ తేదీన ఆన్‌లైన్‌లో జమ చేశాను. జమ చేసిన నాటి నుంచి ఒక్క రూపాయి కూడా నాకు రాలేదు. ఇందులో పెట్టుబడి పెట్టిన మిగిలిన వారిని సంప్రదించగా ఈ సంస్థ బోర్డు తిప్పేసిందని చెప్పడంతో ఏం చెయ్యాలో తెలియడం లేదు.

బొంతు మణికంఠ విక్రంపురం. కొమరాడ మండలం

న్యాయం చేయాలి..



మా గ్రామంలో అందరు ఆన్‌లైన్‌లో ఇండియన్ అడ్వర్టైజ్‌మెంట్ సర్వీస్‌లో పెట్టుబడులు పెడుతున్నారని నేను కష్టపడి సంపాదించి పెట్టుబడిగా రూ.18,300 ఆన్‌లైన్‌లో జమ చేశాను ఒక్క రూపాయి కూడా తిరిగి రాలేదు. ఎవరికి ఫిర్యాదు చేయలో తెలియని పరిస్థితిలో ఉన్నాను. ప్రభుత్వం యంత్రాంగం స్పందించి మాలాంటి బాధితులకు న్యాయం చెయ్యాలి.

సిరిపురం రామారావు

నిమజ్జనోత్సవంలో కొట్లాట

● పదిమందికి గాయాలు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో బుధవారం అర్ధరాత్రి వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా పెద్ద కొట్లాటలో పదిమందికి పైగా గాయపడ్డారు. నిమజ్జనోత్సవంలో రెండు వార్డులకు చెందిన యువకులు సినిమా తరహాలో కర్రలతో కొట్టుకున్నారు. ఈ కొట్లాటలో గాయపడిన వారిలో 9వ వార్డు కౌన్సిలర్ బూర సుజాత, ఆమె భర్త సత్యనారాయణ, పిల్లలు కూడా ఉన్నారు. స్థానిక రామతీర్థం జంక్షన్‌లో ఉన్న 8, 9 వార్డులకు చెందిన యువకుల మధ్య తలెత్తిన వివాదం ఈ కొట్లాటకు దారితీసింది. ఊరేగింపు సమయంలో ప్రారంభమైన గొడవ పెద్దల చొరవతో ఆగింది. అయితే నిమజ్జనం అనంతరం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో యువకులు కర్రలతో మళ్లీ కొట్లాటకు దిగారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కౌన్సిలర్ కుటుంబాన్ని కర్రలతో కొట్టారు.

ఈ కొట్లాటలో 8వ వార్డుకు చెందిన పలువురికి కూడా గాయాలు కావడంతో బాధితులంతా చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు. గాయపడిన కౌన్సిలర్ సుజాత, ఆమె భర్త సత్యనారాయణ, పిల్లలిద్దరూ స్థానిక మిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

ఆమదాలవలస: మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామచంద్రపు రం పంచాయతీ పరిధిలోని ఆనందపురం కాలనీకి చెందిన వృద్ధుడు చింతాడ వెంకటరమణ తన భార్యతో కలిసి బుధవారం సాయంత్రం పాలకొండ వెళ్లి.. తిరుగు ప్రయాణంలో ఆమదాలవలసలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి(వైఎస్సార్‌కూడలి) వద్ద దిగారు. అక్కడి నుంచి పట్టణంలో ఉన్న తన కుమారుడి ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం వేచి చూస్తుండగా ఓ ఆటోలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి వీరిని బండిలో ఎక్కించుకున్నారు. కొంత దూరం వెళ్లాక వెంకటరమణ భార్య మెడలో ఉన్న సుమారు రెండు తులాల పావు పుస్తెలతాడును తస్కరించి తమను దారిలోనే విడిచిపెట్టి వెళ్లిపోయారని బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.